న్యూస్ బాక్స్

ఆటో క్యాబ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలంటూ శనివారం ఇచ్చిన బంద్ పిలుపును విజయవంతం చేయాలని మోటార్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదునూరి నరేష్ పిలుపునిచ్చారు. గురువారం గోదావరిఖని బస్టాండ్ వద్ద సమ్మెలో పాల్గొనాలంటూ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా రంగంలో పని చేస్తున్న డ్రైవర్లకు ఉద్యోగ, ఉపాధి భద్రత లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణారంగ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చినా ఇప్పటివరకు పరిష్కరించలేదని,2019లో మోటార్ వాహనాల చట్టం తీసుకువచ్చి డ్రైవర్లను ప్రమాదంలో నెట్టిందన్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. ఐఎఫ్‌టీ యూ నాయకులు దుర్గయ్య, ఎట్ల రవికుమార్, ఎస్ కొమురయ్య, మల్లేషం, సతీష్, సంపత్, భూమయ్యసుధాకర్, కోటి, బాబు, బాలరాజు, తిరుపతి, సారయ్య పాల్గొన్నారు.

● కమాన్‌పూర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆటోలబంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆటో జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు మట్ట నర్సయ్య, యూనియన్ మండల అధ్యక్షుడు కందుల నర్సింగం తదితరులున్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన కొంకటి రాజమ్మ ఇటీవలి మృతి చెందగా గురువారం రాత్రి రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పరామర్శించారు. మృతురాలి కుమారుడు కొంకటి లింగమూర్తిని పరామర్శించి ఓదార్చారు. చందర్ వెంట నారాయణదాస్ మారుతి, గాండ్ల వెంకన్న, పూదరి మల్లేష్, తదితరులు ఉన్నారు.

హైవే పనులు షురూ..


కన్నాల-పందులపల్లి సమీపంలో ట్రెంచ్ కట్టింగ్ పనులు(ఫైల్)

- నాగ్‌పూర్-విజయవాడ నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం
- మొదటి ప్యాకేజీలో మంచిర్యాల-మంథని మధ్య..
- కన్నాల వద్ద ట్రెంచ్ కట్టింగ్‌తో మొదలైన పనులు
- రవాణా సౌకర్యం మెరుగుపై ఆశలు..

మంథని, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నాలుగు లైన్ల నేషనల్ హైవే-163 పనులు ఊపందుకోనున్నాయి. దీంతో జిల్లాలో రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాల్లో భారీగా భూముల ధరలకు రెక్కలు వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతుల భూములను కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో భూములకు డిమాండ్ వస్తుండడంతో రైతులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

● మంథని మండలంలోని కన్నాల-పందులపల్లి గ్రామాల శివారులో ఇటీవల అధికారులు ట్రెంచ్ కట్టింగ్ పనులను ప్రారంభించారు. దీంతో జిల్లాలో నేషనల్ హైవే నిర్మాణానికి అడుగుపడింది. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మూడు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ నేషనల్ గ్రీన్‌ఫీల్డు ఎక్స్‌ప్రెస్ హైవే-163 నిర్మాణాన్ని కేంద్రం ప్రతిపాదించింది. గ్రీన్‌ఫీల్డ్ హైవే తరహాలో పట్టణాలు, జనవాసాలకు దూరంగా మైదాన ప్రాంతాల మీదుగా సాగే జాతీయ రహదారి చేపడుతున్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ వరకు కేంద్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనుల్లో మంచిర్యాల-వరంగల్ సెక్షన్ విభాగంలో 2ప్యాకేజీల్లో నేషనల్ హైవేను నిర్మించనున్నారు. పరిహారం చెల్లింపుకోసం ఇప్పటికే కొందరు నిర్వాసితులు కోర్టును ఆశ్రయించారు. అడ్డంకులు సైతం పెద్దగా లేకపోవడంతో జిల్లా ప్రజలకు త్వరలోనే జాతీయ రహదారి కల నెరవేరనుంది. దీంతో మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలతో పాటు పలు జిల్లాలకు రవాణా సౌకర్యం మెరుగుపడనున్నది.

● ప్యాకేజీ-7లో నార్వ నుంచి పుట్టపాక హైవే నిర్మాణం..

ప్యాకేజీ-7 కింద చేపట్టే ఎక్స్‌ప్రెస్ రోడ్డును విభజించిన 3 ప్యాకేజీల్లో భాగంగా మంచిర్యాల సమీపంలోని నార్వ ప్రాంతం నుంచి మంథని మండలం పుట్టపాక వరకు 31.466 కిలోమీటర్లు మొదటి విడతలో తీసుకున్నారు. రెండో ప్యాకేజీలో పుట్టపాక నుంచి పింగిరెడ్డిపల్లి వరకు 37.050 కిలో మీటర్ల రహదారిని నిర్మించనున్నారు. మూడో ప్యాకేజీలో పింగిరెడ్డిపల్లి నుంచి ఊరగొండ వరకు 39.890 కిలో మీటర్ల హైవేను నిర్మించనున్నారు.

● ఇది జాతీయ రహదారి సమగ్ర సమాచారం..

ఈ జాతీయ రహదారికి 2021 ఫిబ్రవరి 3న కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. నాగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు గ్రీన్‌ఫీల్డు కారిడార్ నేషనల్ హైవే నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రూ.14,666 కోట్ల నిధుల ప్రతిపాదనతో 405 కిలోమీటర్ల ప్రాజెక్టును 2027 పూర్తిచేయాలని కాలపరిమితి పెట్టుకున్నారు. తొలి ప్యాకేజీ నిర్మాణం మంచిర్యాల నుంచి వరంగల్ వరకు, ప్యాకేజీ-2లో జిల్లాలోని మంథని-రామగిరి-ముత్తారం మండలాల మీదుగా నేషనల్ హైవే నిర్మాణం జరగ నున్నది. జిల్లాలో 16గ్రామాల్లో 40కిలో మీటర్ల రహదా రికి రూ. 2,607 కోట్లు కేటాయించారు.

● 16 గ్రామాల మీదుగా 4 లైన్ల నేషనల్ హైవే నిర్మాణం..

4లైన్ల జాతీయ రహదారి మంథని మండలం ఉప్పట్ల గోదావరి సమీపం నుంచి పోతారం, విలోచవరం, నాగారం, కన్నాల, పందులపల్లి, పుట్టపాక, రామగిరి మండలంలోని ఆదివారంపేట, బేగంపేట, నవాబ్‌పేట, ముత్తారం మండలంలోని లక్కారం, కేశనపల్లి, ముత్తారం, అడవిశ్రీరాంపూర్, ఓడేడ్ మీదుగా భూపాలపల్లి జిల్లాలో ప్రవేశిస్తుంది. మూడు మండలాల పరిధిలోని 16 గ్రామాల మీదుగా 40 కిలోమీటర్ల పొడవు ఉంటుందని అంచనా.

మిగతా 6లో


అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన హర్షవర్ధన్, అభిరామ్

చిచ్చరపిడుగులు..

- కరాటే పోటీల్లో సుల్తానాబాద్ విద్యార్థుల ప్రతిభ
- అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న హర్షవర్ధన్, అభిరామ్

6


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

రేపు కాటారంలో ధర్మ యుద్ధ మహాసభ

- పోస్టర్లను ఆవిష్కరించిన దళిత బంధు సాధన సమితి నాయకులు

6

రామగుండం టీఎస్‌టీపీపీపై కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ వంశీకృష్ణ


కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ

పెద్దపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో గల టీఎస్‌టీపీపీ ద్వారా నిర్మించనున్న 800 మెగావాట్ల సామర్థ్యం గల మూడు యూనిట్లను త్వరిత గతిన చేపట్టాలని గురువారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర విద్యుత్, గృహ నిర్మాణ వ్యవహారాల మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఢిల్లీలో ఆయనకు వినతిపత్రం సమర్పించారు. రామగుండం టీఎస్‌టీపీపీ 800 మెగావాట్ల 3యూనిట్లు చేపడితే దేశానికి 25శాతం విద్యుత్ అవసరాలను తీర్చనున్నదని ఎంపీ, మంత్రికి వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరగా పనులు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఎంపీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు రిజర్వేషన్ దామాషాపై బహిరంగ విచారణ

- జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రంగారెడ్డి

పెద్దపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల దామాషాపై డిసెంబర్ 7న బహిరంగ విచారణ చేస్తున్నామని, దీనిలో ఆసక్తి కలిగిన బీసీ కుల సంఘాలు ప్రజాప్రతినిధులు, ఇతర కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు హాజరై తమ అభిప్రాయాలను తెలియ జేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జే రంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్ తమాషా ఖరారు చేసేందుకు భూసాని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డెడికేటెడ్ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. డిసెంబర్ 7న ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియం హాల్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు బహిరంగ విచారణ కార్యక్రమం నిర్వహించనున్నారని తెలిపారు. ఆసక్తిగల వారు హాజరు కావాలని ఆయన కోరారు.

మంత్రి శ్రీధర్‌బాబు కృషితో అభివృద్ధి నిధులు

మంథని, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : మంత్రి శ్రీధర్‌బాబు కృషితో మంథని ప్రాంతంలో అనేక అభివృద్ధి పనునలకు సీఎం రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేయడంతోపాటు పెద్దపల్లిలో నిర్వహించిన యువవికాసం సభ విజయవంతమైందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్‌లు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ యువ వికాస సభ పూర్తిస్థాయిలో విజయవంతంమైందన్నారు. ఇందుకు సహకరించిన యువ నాయకుడు దుద్దిల్ల శ్రీనుబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సీఎం ఏనుముల రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబులు గోదావరినదిపై రూ.125 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి, గంగాపురి నుంచి శివకిరణ్ గార్డెన్స్ వరకు శ్రీపాద బైపాస్ రోడ్డుకు రూ. 162 కోట్లు, ఎక్లాస్‌పూర్-ఖమ్మపల్లి రోడ్డు వెడల్పుకు రూ. 11.90 కోట్లు, మంథనిలో ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయటానికి రూ.22.50కోట్లు, గుంజపడుగులో 30 పడకల ఆసుపత్రికి రూ.24 కోట్లు, పలు గ్రామాల్లో హెల్త్ సబ్‌సెంటర్లు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, కిసాన్ సెల్ జిల్లా చైర్మన్ ముస్కుల సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు నూకల బానయ్య, ఎరుకల ప్రవీణ్, జనగామ నర్సింగ రావు, కుడుదుల వెంకన్న, ఊదరి శంకర్, మంథని సత్యం, ఐలి శ్రీనివాస్, పర్శవేన మోహన్‌లు పాల్గొన్నారు.

● మంథని, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు కృషితోనే మంథనికి సీఎం రేవంత్‌రెడ్డి భారీగా అభివృద్ధి పనులు మంజూరు చేయడంతో పాటు వాటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ వెల్లడించారు. గురువారం కొత్త శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు భారీగా నిధులు కేటాయించడంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

యువజన కాంగ్రెస్ నేతలకు అభినందన


ఎన్నికల్లో గెలుపొందిన వారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన వారిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పెద్దెల్లి తేజస్విని, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా బొంకూరి అవినాష్, రామగుండం నియోజకవర్గం అధ్యక్షునిగా నాజిమోద్దీన్, రామగుండం కార్పొరేషన్ యూత్ అధ్యక్షునిగా కొటం సతీష్, అంతర్గాం మండల యూత్ అధ్యక్షునిగా శ్యాంసుందర్, పాలకుర్తి మండల అధ్యక్షునిగా వాసుదేవ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా ముచ్చకుర్తి రమేష్, నల్లాల జ్యోతి, అడప సాయికిరణ్, ఉపాధ్యక్షునిగా ఎల్లపు సాయి కృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లా వ్యాప్తంగా యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

రేపు వైద్య శిబిరం

ధర్మారం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అలయన్స్ క్లబ్ ధర్మారం ఆధ్వర్యంలో ఉచిత ఆక్యుప్రెషర్ థెరపీ ట్రీట్‌మెంట్, నాచురోపతి క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు అలయన్స్ క్లబ్ అధ్యక్షులు మామిడిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 7నుంచి 12వ, తేది వరకు మహాలక్ష్మి హాస్పిటల్ ధర్మారంలో ఈ క్యాంపు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ క్యాంపులో పలు ఆరోగ్య సమస్యలకు నిపుణులైన వైద్యులతో ఉచితంగా చికిత్స అందిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపరచుకోవాలని ఆయన సూచించారు.


గ్యారంటీల గారడీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి, చిత్రంలో సురేష్‌రెడ్డి, లావణ్య తదితరులు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సంవత్సర కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలపై గారడీ చేస్తూ కాలం గడుపుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నెరవేర్చలేకపోయిన హామీలపై తెలంగాణ గ్యారంటీలు,హామీలు, డిక్లరేషన్ల పేరుతో మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకి తెలియజేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు చార్జీషీట్‌ని విడుదల చేసినట్టు తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన నిరసన ర్యాలీని విజయవంతం చేసిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికలకు ముందు మహిళలకు ఆర్థికసాయం, చదువుకునే అమ్మాయిలకు స్కూటీలు, ఆడబిడ్డల పెళ్ళికి తులం బంగారం అని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కౌలు రైతులకు ఎకరానికి 15 వేల రూపాయలు, వ్యవసాయ కూలీలకు 12వేల రూపాయలు ఇవ్వడంలో జాప్యం ఎందుకన్నారు. ఈనెల 6,7,8 తేదీల్లో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీలు, బహిరంగ సభలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని సునీల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాత్ర ప్రముక్ కాసిపేట శివాజీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి, శిలారపు పర్వతాలు, సోమరపు లావణ్య, ఎర్రోళ్ల శ్రీకాంత్, తంగెడ రాజేశ్వర్‌రావు, పెద్దపల్లి రవీందర్, మేకల శ్రీనివాస్, కావటి రాజగోపాల్, అమరవది రామన్న, ఉప్పు కిరణ్, వొల్లె తిరుపతి, మత్సగిరి రాము, అజయ్ జంగపల్లి తదితరులు పాల్గొన్నారు.

మానేరు తీరంలో.. తెల్లపించం పూల సోయగం..


గుంపుల శివారులోని మానేరులో తెల్లపించం పూలు

ఓదెల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మానేరు తీరంలో తెల్ల పించం పూలు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల మానేరులో నీటి ప్రవాహం తగ్గడంతో ఓదెల మండలం గుండ్లపల్లి నుంచి గుంపుల శివారు వరకు వాగులో తెల్ల పించం గడ్డిపూలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. బాటసారులు, వాహనదారులు, విద్యార్థులు ఆగి ప్రకృతి అందానికి పరవశించిపోతూ సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఈ తెల్లపించం పూలు మరోనెల వరకు కనువిందు చేస్తాయి.

రామగుండంలో ప్రజలు కోరుకున్న మార్పు మొదలైంది..

- పాలకుర్తి లిఫ్ట్‌తో 15వేల ఎకరాలకు సాగునీరు - విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, చిత్రంలో మేయర్ అనిల్‌కుమార్ తదితరులు

గోదావరిఖని, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రామగుండంలో ప్రజలు కోరుకున్న మార్పు మొదలైందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగుండం అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు సహకరిస్తున్నారన్నారు. జిల్లాను సస్యశ్యామలం చేసే పత్తిపాక రిజర్వాయర్‌తో పాటు పాలకుర్తి లిఫ్ట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారన్నారు. రూ.354కోట్ల అంచనాలతో రూ.15వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు లిఫ్ట్ ప్రతిపాదించిందని, కొన్ని సాంకేతిక ఇబ్బందులవల్ల కొంత ఆలస్యమవుతుందని, త్వరలోనే శంకుస్థాపన జరుగనున్నదన్నారు. బండలవాగు ప్రాజెక్టుకు సంబంధించి సబ్‌స్టేషన్ పనులు పదిరోజుల్లో పూర్తిచేశారని, రూ.19వేల ఎకరాలకు సాగునీరందించే ఈ ప్రాజెక్టు త్వరలోనే ప్రారంభం కానున్నదన్నారు. పదేళ్లలో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నా కూడా పూర్తి చేయలేకపోయారన్నారు. రామగుండం అభివృద్ధికి రూ.200కోట్ల టీయూఎఫ్ఐడీసీ, అమృత్ నిధులతో పాటు రూ.60కోట్ల ఆర్అండ్‌బీ నిధులు కూడా మంజూరు చేశారన్నారు. రామగుండం ఫ్లైఓవర్, లైట్ ఆర్చ్, రాజీవ్ రహదారి సర్వీస్ రోడ్లు, గ్రామీణ ప్రాంతాల డబుల్ రోడ్లకు నిధులు మంజూరయ్యాయన్నారు. అలాగే 27ఎకరాల్లో రామగుండం పట్టణంలో రూ.100కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కూడా నిర్మాణం కానున్నదని, నర్సింగ్, పారామెడికల్ కళాశాల అడ్మిషన్ ఇచ్చారన్నారు. నర్సింగ్ కళాశాల నిర్మాణానికి రూ. 26 కోట్లు మంజూరయ్యాయని, మున్సిపల్ కార్పొరేషన్‌లో రోడ్లు, డ్రైన్లకు రూ.20కోట్లకు మంజూరు ఇచ్చారన్నారు. గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో పాత క్వార్టర్ల స్థానంలో వ్యాపార సముదాయాల నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరుచేశారని, త్వరలోనే టెండర్‌ప్రక్రియ కూడా పూర్తి కానున్నదన్నారు. జేఎన్‌టీయూసీ నుంచి ఫైవింక్లయిన్ వరకు ఫోర్‌లైన్ రోడ్డు, మంథని పాత రహదారి ఫోర్ వీలర్స్ వెళ్లేలా నిర్మాణానికి ఆమోదం లభించిందన్నారు. రామగుండం విద్యుత్ కేంద్రానికి త్వరలోనే శంకుస్థాపన చేయనున్నారన్నారు. నాలుగునెలల క్రితమే రామగుండంకు ఎయిర్‌పోర్టు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి ప్రతిపాదన చేశామని, బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టు పరిసరాల్లో విద్యుత్ టవర్లు ఉండడం వల్ల వయబుల్ కాదని ఎయిర్‌పోర్టు అథారిటీ నివేదిక ఇచ్చిందన్నారు. దీంతో అంతర్గాంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో నిర్మించేలా ప్రతిపాదనలు చేశామన్నారు. అధికారికంగా ముఖ్యమంత్రి కూడా పౌర విమానయన శాఖ మంత్రి రాంమోహన్‌నాయుడుకు లేఖ ఇచ్చారని, స్థల పరిశీలన తరువాత మంజూరు లభించే అవకాశం ఉందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు, హర్కార వేణుగోపాల్, ఎంపీ వంశీ కృష్ణలు కూడా ఎయిర్ పోర్టు ఏర్పాటు చేయాలని పట్టుబడుతున్నారన్నారు. దీని వలన మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు కూడా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. రామగుండంలో అభివృద్ధిపై విపక్షాలు రాద్ధాంతం చేయాలని చూస్తున్నాయని, నగరంలో పలు డివిజన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మేయర్ బంగి అనీల్ కుమార్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, కొలిపాక సుజాత, పెద్దెల్లి తేజస్విని, ముస్తాఫా, సనాఫక్రుద్దీన్, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, పాతిపెల్లి ఎల్లయ్య, దీటి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సీఎం సభకు వందల కోట్లు ఖర్చు చేశారు..

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సీఎం సభకోసం వందల కోట్లు ఖర్చు చేశారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. సభ పేరిట సీఎం పర్యటించిన రోజు చీకటి రోజని విమర్శించారు. గురువారం పుట్ట మధు విలేకరులతో మాట్లాడుతూ.. ఏడాది కాలంలో యువకులకు ఏమీ చేయకుండా యువ వికాస్ పేరుతో సభ నిర్వహించి కనీసం యువకుల కోసం ఏం చేస్తారనేది చెప్పకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సభ పేరిట మంథని ఎమ్మెల్యే బలనిరూపనకా లేక రేవంత్ రెడ్డి కుర్చీకి ఎసరు పెట్టేందుకో అర్థం కావడం లేదన్నారు. సీఎం సభకు మంథని ఎమ్మెల్యే వంద కోట్లు వెచ్చించారన్నారు. కేవలం చిన్నిచిన్న అభివృద్ధి పనుల పేరుతో వంద కోట్లతో సభ నిర్వహించడం వెనుక ఆంతర్యం ఏమిటనే విషయం ప్రజలు ఆలోచన చేయాలన్నారు. మంథని ఎమ్మెల్యే రాబోయే రోజుల్లో వేల కోట్లు సంపాదించుకోవాలనే ఆలోచనతో ఇంత పెద్దమొత్తంలో డబ్బులు వెచ్చించాడా అని ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. అంతేకాకుండా చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో సీఎం సభకు పైసలు ఇచ్చి జనాలను తరలించారన్నారు. ఇప్పటికే మార్పు, ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ పార్టీ అనాదిగా చీకట్లోనే ఉంచిందనడానికి నిలువెత్తు సాక్ష్యమైందన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఉన్న ప్రైవేటు పాఠశాలను బంద్ చేసి బస్సులను వాడుకుని ఒక్కరోజు పిల్లలకు చదువు లేకుండా చేశారన్నారు. సీఎం వస్తున్నాడని దారి మళ్లింపు చేశారని, కరీంనగర్ నుంచి మంథనికి రావాలంటే మంచిర్యాలకు వెళ్లేలా రూట్ మ్యాప్ చేశారని అన్నారు. ప్రధాన మంత్రిస్థాయి నాయకులు వచ్చినా ఇంత పెద్దగా దారి మళ్లింపు ఉండదన్నారు. సభలతో ప్రజలకు ఒరిగిందేమీ ఉండదని, ప్రజా పాలనపై దృష్టి సారించి, ప్రజలకు అవసరమయ్యే అభివృద్ధి పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, వేల్పుల గట్టయ్య, గొబ్బూరి వంశీ, మంథని సత్యం, కుమార్‌లు పాల్గొన్నారు.



సాగు చేస్తున్న నారంభట్ల భరద్వాజ్

సాఫ్ట్‌వేర్ వదిలి సేంద్రియ సాగువైపు..

- ఉద్యోగాలు వదిలి వ్యవసాయం
- సహజ పద్ధతిలో అధిక దిగుబడులు
- వరి, చెరుకు విత్తనోత్పత్తికి ప్రయత్నాలు
- రైతులకు అవగాహన

కోరుట్ల రూరల్/మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్య అభ్యసించారు.. సాఫ్ట్‌వేర్ కొలువులో స్థిరపడ్డారు... అయినా వారికి వృత్తి పరంగా సంతృప్తి అనిపించలేదు. చిన్నప్పటి నుంచి వ్యవసాయంపై ఆసక్తి ఉండటంతో ఉద్యోగాలను వదిలి నూతన పద్ధతిలో సాగు చేయాలని ఇంటి బాట పట్టారు.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన నారంభట్ల భరద్వాజ్, మెట్‌పల్లి మండలంలోని చౌలమద్ది గ్రామానికి చెందిన కుంట మధుకుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలను వదిలి సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. చుట్టు పక్కల రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ నుంచి సాగువైపు వచ్చిన రైతుల గురించి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

వరి, చెరుకు సాగు...

కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన నారంభట్ల భరద్వాజ్ ముంబైలోని ఓ కార్పొరేట్ కంపెనీలో మంచి హోదాతో ఉద్యోగంలో చేరాడు. ఏడాదికి రూ. 6లక్షల ప్యాకేజీతో సుమారు రెండేళ్ల విధులు నిర్వహించాడు. వ్యవసాయంపై మక్కువతో వ్యవసాయం వైపు మళ్లాడు. ఊళ్లో తమకున్న 19ఎకరాల భూమిలో సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ వరి, చెరుకు సాగు చేస్తున్నాడు. విత్తనోత్పత్తి పంటలపై దృష్టి సారించాడు. చెరుకు, వరివిత్త నోత్పత్తిని చేస్తూ రైతులకు విక్రయిస్తున్నాడు. మెదక్, హన్మకొండ, కరీంనగర్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి తదితర జిల్లాల ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు సేంద్రియ పద్ధతిలో పండించిన వరి, చెరుకు విత్తనాలను భరద్వాజ్‌వద్ద నుంచి కొను గోలుచేసి తీసుకువెళ్తున్నారు. కొన్ని పశువులను పెంచుతూ స్వయంగా సేంద్రియ ఎరువులను తయారు చేసుకుంటూ విని యోగిస్తున్నాడు.

ఎరువుల దుకాణాల్లో లభించే వేస్ట్ డికంపోజర్ అను వంద లీటర్ల లిక్విడ్ బాటిల్‌ను తీసుకొని సుమారు పది కిలోల బెల్లం కలిపి మిశ్రమంగా తయారు చేస్తాడు. వరి, చెరుకు సాగుచేసే వ్యవసాయ క్షేత్రంలో సుమారు పక్షం రోజులు ముందుగా ఈ మిశ్రమాన్ని పిచికారి చేస్తా డు. మిశ్రమం నేలలో మురిగిన తరువాత సాగుకోసం దుక్కులు దున్నుతాడు. విత్త నాలు వేసి సేంద్రియ ఎరువులు విని యోగిస్తూ పంటలు సాగు చేస్తున్నాడు. దాదాపుగా మూడేళ్లుగా సాగు చేస్తున్న ఏ ఒక్క సందర్భంలోనూ భరద్వాజ్ వేసిన పంటకు ఎటువంటి తెగుళ్లు, దోమపోటు, రోగాలు రాకపోవడం విశేషం. సాధారణంగా ఎకరానికి సుమారు 30 నుంచి 34క్వింటాళ్ల వరకు వరి దిగుబడి వస్తుండగా అదనంగా నాలుగు నుంచి ఎనిమిది క్వింటాళ్ల వరకు దిగు బడి సాధిస్తున్నాడు. భరద్వాజ్ అనుసరిస్తున్న నూతన సాగు పద్ధతులు, కొత్త వంగడాల ఆవిష్కరణ వంటి అంశాలను గుర్తించిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 2017లో ఉత్తమ రైతుగా అవార్డును ప్రకటించింది. హైద్రాబాద్ లో మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు.



ఆవులకు మేత వేస్తున్న భరద్వాజ్

సేంద్రియ వ్యవసాయంపై మక్కువతో...

మెట్‌పల్లి మండలంలోని చౌలమద్ది గ్రామానికి చెందిన కుంట మధుకుమార్ బీటెక్ చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఏడాదికి రూ. 16 లక్షల జీతం పొందేవాడు. కరోనా సమయంలో ఇంటికి చేరుకున్నాడు. ఉద్యోగం వదిలి సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేశాడు. ఆర్గానిక్ వ్యవసాయం చేసేందుకు నిశ్చయించుకున్నాడు. మొదట నాలుగు ఆవులు, పన్నెండు బర్రెలను కొనుగోలు చేశాడు. పంచగవ్య, జీవామృతం బ్రహ్మాస్త్రం వంటి ఆర్గానిక్ ఎరువులను తయారు చేసి పంటలపై పిచికారి చేశాడు. చీడపీడల నివారణకు వేప కషాయం పిచికారి చేశాడు. నలుగురు కూలీల సాయంతో ఆరు ఎకరాల్లో వరి, మిగితా భూమిలో మొక్కజొన్న, పసుపు, నువ్వు, వేరుశనగ, కూరగాయాలను పండిస్తున్నాడు.



చౌలమద్దిలో ఆర్గానిక్ ఎరువులతో సాగు చేసిన మొక్కజొన్నను చూపుతున్న మధుకుమార్



చౌలమద్దిలోని వ్యవసాయ క్షేత్రంలో పశువులకు ఆహారం అందిస్తున్న మధుకుమార్

సుభాష్ పాలేకర్ శిష్యరికంతో..

నారంభట్ల భరద్వాజ ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ అందిస్తున్న సుభాష్ పాలేకర్ వద్దకు వెళ్లి మెళకువలను సాధించాడు. దీంతో పాటు గుంటూరు జిల్లాకు చెందిన ధ్యాన పండిత్ నెక్కోటి సుబ్బారావును ఆదర్శంగా తీసు కొని నూతన పద్ధతుల ద్వారా సాగు చేస్తున్నాడు. సేంద్రియ వ్యవసాయ పద్ధతిపై తెలుసుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో ఉపయోగించి అధిక దిగుబడి సాధిస్తున్నాడు.

పంటలను నేరుగా మార్కెట్‌లోకి..

మధుకుమార్ తాను పండించిన పంటలను నేరుగా మార్కెట్‌కు తరలించి విక్రయించేవాడు. అనంతరం మెట్‌పల్లిలో ఒక షాప్ ఏర్పాటు చేసి వినియోగదారులకు సమాచారం అందించాడు. పంట ఉత్తత్తులు ఎప్పటికప్పుడు అమ్ముడు పోయాయి. ఆవు, బర్రె పాలు, పెరుగు, నెయ్యి, నెయ్యితో తయారు చేసిన తిను పదార్థాలతో పాటు పప్పు దినుసులు, పంటలు, తిను బండరాలు విక్రయించడం మొదలు పెట్టాడు. మార్కెట్‌లో మంచి స్పందన రావడంతో ఇతర రైతులు ఆర్గానిక్‌తో పండించిన పంట లను కూడా విక్రయిస్తున్నాడు.

వ్యవసాయమే పండుగలా మార్చాలని



పల్లెల్లో వ్యవసాయమే పండుగలా మార్చే ప్రయత్నంలో భాగంగానే సాగువైపు వచ్చాను. కుటుంబ సభ్యుల సహకారం సంపూర్ణంగా లభిస్తోంది. సాగులో సేంద్రియ విధానాలను వినియోగిస్తున్నాను. పలువురు రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నాను. దీనికితోడు విత్తనోత్పత్తి సైతం జరుపుతున్నాను.

-నారంభట్ల భరద్వాజ, రైతు, అయిలాపూర్

రైతుల్లో మార్పు కోసమే...



భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే రైతుల్లో మార్పు రావాల్సిన అవసరం ఉంది. పంటలపై విపరీతంగా రసాయన ఎరువులు పిచికారీ చేయడంతో ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. రసాయనాలతో రైతులు అప్పుల పాలవుతున్నారు. దాన్ని చూసి కొంత మంది రైతులనైనా ప్రకృతి వ్యవసాయం వైపు తీసుకరావాలని నిర్ణయించు కున్నాను. ఉద్యోగం వదిలి ఆర్గానిక్ వ్యవసాయం వైపుకు వచ్చాను.

- కుంట మధుకుమార్, చౌలమద్ది రైతు

రోడ్డు ప్రమాదంలో రైస్‌మిల్లు ఆపరేటర్ మృతి

సుల్తానాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైస్‌మిల్లు ఆపరేటర్ మృతిచెందాడు. పెద్దపల్లికి చెందిన ప్రసాద్(35) అనే కార్మికుడు సుల్తానాబాద్ ప్రాంతంలోని ఓ రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం మిల్లు వద్ద రాజీవ్ రహదారిని దాటుతుండగా సుల్తానాబద్ నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న లారీ అతన్ని ఢీకొట్టింది. దీంతో అక్కడిక్కడే మృతిచెందాడు.

చిన్నారిపై వీధికుక్క దాడి

ఇల్లంతకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో రడం రియాన్షి (4) అనే చిన్నారిపై గురువారం వీధికుక్క దాడి చేసి గాయపర్చింది. రియాన్షి ఇంటిముందు ఆడకుంటుండగా వీధికుక్క వచ్చి దాడి చేసింది. కుటుంబసభ్యులు ఇల్లంతకుంట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

మల్యాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మ్యాడంపల్లికి చెందిన ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తొట్ల రాయమల్లు(64) భార్య వీరవ్వ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. భార్య ఆరోగ్యంపై బెంగపెట్టుకున్న రాయమల్లు తన భార్యకు ఏమైనా జరిగితే తాను ఒంటరి వాడిని అవుతాననే మనోవేదనకు గురయ్యాడు. తమ ఇంటి ముందు ఉండే మరో ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు

- అడ్డుకున్న అధికారులు



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

చందుర్తి, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట గ్రామ శివారులోని తిరుమల లోది ప్రాంతంలో అక్రమంగా మట్టితరలిస్తుండగా రెవెన్యూ అధికారులు గురువారం అడ్డుకున్నారు. తిరుమల లోది ప్రాంతంలోని సర్వే నంబరు 177లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇందులో భాగంగా చదును చేస్తూ మట్టిని తరలిస్తున్నారని గ్రామస్థులు రెవెనూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాదాపు మూడు ఎకరాల్లో భూమిని చదును చేశారని పేర్కొన్నారు. దీంతో రెవెన్యూ అధికారులు చదును చేసే పనులను నిలిపివేచారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ విచారణ అనంతరం చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సుమన్ హత్య కేసు నిందితుల అరెస్ట్

- డీఎస్పీ రఘుచందర్



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

వెల్గటూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరిపల్లిలో ఈ నెల 2న జరిగిన బొమ్మెల సుమన్ (34) హత్య కేసులో నిందితులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన బొమ్మెల సుమన్, బొమ్మల డిల్లేష్‌లు అన్నదమ్ములు. గతంలో బొమ్మల సుమన్ రోజూ మద్యం తాగి వచ్చి బొమ్మల డిల్లేష్‌ని అతని భార్యను, కుటుంబ సభ్యులను తిడుతూ, గొడవ చేస్తూ ఉండేవాడు. బొమ్మెల సుమన్ యొక్క తల్లికి ఆమె తండ్రి వారసత్వంగా వచ్చిన సుమారు 36 గుంటల భూమి కుమ్మరిపల్లి హాస్టల్ వద్ద ఉన్నది. అట్టి భూమిని కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి సుమారు రూ.11 లక్షలకు అమ్మకానికి పెట్టగా అతడు బయానాగా రూ.2,60,000 అప్పజెప్పాడు. ఆ డబ్బులు మొత్తం డిల్లేష్ ఒక్కడే తనకు అప్పులు ఉన్నాయని చెప్పి తన సొంతానికి వాడుకున్నాడు. ఆ బయనా డబ్బులలో నాకు కూడా వాటా వస్తుందని సుమన్ పలుమార్లు డిల్లేష్ ని అడగగా ఈ విషయంలో వారి మధ్య గొడవలు జరిగాయి. దీనితో తన అన్నను చంపేస్తే ఆ భూమి డబ్బులు తనకే చెందుతాయని ఇక తన అన్నతో ఎలాంటి సమస్య ఉండదని భావించిన డిల్లేష్ తన అన్నను హత్య చేయాలని నిర్ణయించు కున్నాడు. కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన తన స్నేహితుడు వంజరి సురేందర్ సహాయం కోరగా అతను కూడా హత్య చేయడానికి అంగీకరించాడు. దీనితో ఈ నెల 2న రాత్రి సుమన్‌ను బొమ్మెల డిల్లేశ్ అతని స్నేహితుడు పోతానక (వంజరి) సురేందర్ ఇద్దరు కలిసి కత్తితో పొడిచి హత్య చేసి పారిపోయారు. మృతుని భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేస్ నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి నిందితులు ఇద్దరిని పోలీసులు గురువారం కుమ్మరిపల్లిలో అదుపులోకి తీసుకున్నా రు. నిందితుల నుంచి హత్యకి ఉపయోగించిన కత్తి, వారు పారిపోవడానికి ఉపయో గించిన బైక్, సెల్‌ఫోన్లు వారి బట్టలు స్వాధీనం చేసుకొని నిందితులని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాంనర్సింహ రెడ్డి, వెల్గటూర్ ఎస్సై ఉమా సాగర్, బుగ్గారం ఎస్సై శ్రీధర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతరలో పటిష్టమైన భద్రత కల్పించాలి

- ఎస్పీ అశోక్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

గొల్లపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మల్లిఖార్జున స్వామి జాతర సందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం గొల్లపల్లి మండలం మల్లన్నపేట శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని జిల్లా ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను, భక్తుల క్యూలైన్‌లను, వాహనాల పార్కింగ్ స్థలాలను, రాకపోకలకు సంబంధించిన ప్రదేశాల్లో ఏర్పాటు చేయవలసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆలయ పరిసరాల ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే జాతర ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోస్తు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. డీఎస్పీ రఘుచందర్, ఎస్సై చిర్ర సతీష్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, ఆలయ ఈవో విక్రమ్, ఆలయ పౌండరీ ట్రస్టీ కొండూరి శాంతయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి పోలీసుస్టేషన్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ సందర్శించారు.

ఎస్సారార్ పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

గణేశ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ అటానమస్ కళాశాల పీజీ రెండో, నాలుగో సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ తిరుకోవెల శ్రీనివాస్ గురువారం విడుదల చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల అటానమస్ హోదాలో పీజీ మొట్టమొదటి బ్యాచ్ ఫలితాలు విడుదల చేశామని తెలిపారు. ఈసందర్భంగా కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీనివాస్ మాట్లాడుతూ పీజీ రెండవ సెమిస్టర్‌లో 254 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 198 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పీజీ నాలుగో సెమిస్టర్‌లో 247 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 214 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నితిన్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు టి కరుణాకర్, డాక్టర్ ఎం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న రైల్వే సిబ్బంది

కరీంనగర్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత రైల్వేశాఖ గుర్తింపుసంఘం ఎన్నికలు గురువారం కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో నిర్వహించారు. కరీంనగర్ నుంచి ఆర్మూర్ వరకు ఉన్న రైల్వేస్టేషన్ల పరిధిలోని అన్ని శాఖల్లో మొత్తం 308 మంది ఓటర్లు ఉన్నారు. ఆయా శాఖలకు చెందిన రైల్వే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 308 ఓట్లకు గాను 250 ఓట్లు పోలైనట్లు పోలింగ్ అధికారి యశ్‌పాల్‌సింగ్ తెలిపారు.

రేపు బీసీ కమిషన్ పర్యటన

సిరిసిల్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రానికి శనివారం ప్రత్యేక బీసీ కమిషన్ రానున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల్లో వెనకబాటుతనం, వాటి స్వభావం, ప్రభావం వంటివాటిపై అనుభవ పూర్వకమైన విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కరీంనగర్ కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నామని, ఉమ్మడి జిల్లాకు సంబంధించిన వారు రాతపూర్వకంగా అభ్యర్థనలను ఇవ్వవచ్చని సూచించారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను యువజన కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కష్టకాలంలో ఉన్నా, అధికారంలో లేకపోయినా కాంగ్రెస్ పార్టీ జెండాను విడిచి పెట్టకుండా తన గెలుపు కోసం కష్టపడ్డారని ఆయన తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన యువ వికాస్ బహిరంగ సభలో పాల్గొనేందుకు తరలివచ్చిన ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పేరు పేరున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ధర్మపురి దేవాలయ అభివృద్ధి కోసం రూ 50 కోట్లు, మురికి నీరు గోదావరి నదిలో కలువకుండా డ్రైనేజీ నిర్మాణం కోసం రూ. 17 కోట్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. ధర్మపురి పట్టణంలో నైట్ కాలేజీని పునఃప్రారంభం చేశామని, చెగ్యాం భూ నిర్వాసితులకు రూ.18 వేల కోట్లు పరిహారం అందించినట్లు వివరించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేయించి, నిర్మాణం కోసం 25 ఎకరాల స్థలాన్ని సేకరించడం జరిగిందని ఆయన తెలిపారు. అంతకు ముందు ఇటీవల ప్రకటించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించిన ధర్మపురి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అశోద అజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు పాల గణేష్, రాందేని మొగిలి, మండల అధ్యక్షు లు అప్పం తిరుపతిని ప్రత్యేకంగా అబినందించారు. వెల్గటూర్, బుగ్గారం, గొల్లపల్లి, పెగడపల్లి, ధర్మారం మండలాల అధ్యక్షులుగా నియమితులైన రమేష్, అంజిత్, గౌతమ్, అనిల్, తిరుపతిలకు ఆయన పార్టీ కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. సమావే శంలో ధర్మపురి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుల వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అశోద అజయ్‌కుమార్, ధర్మారం ఏఎంసీ చైర్మన్ రూప్లానాయక్, మండల యు వజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన పనులు

- అసంపూర్తిగా బాలుర వసతి గృహం
- ఏళ్లుగా అద్దెగృహంలో హాస్టల్ నిర్వహణ
- అరకొర వసతులతో విద్యార్థుల ఇబ్బందులు



అసంపూర్తిగా ఉన్న భవనం



అద్దె భవనంలో కొనసాగుతున్న ఎస్సీ బాలుర వసతి గృహం

పెగడపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహ నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోయింది. మండల వ్యవస్థ ఏర్పా టు నుంచి పెగడపల్లి మండల కేంద్రంలో ఎస్సీ బాలుర వసతి గృహం, బీసీ బాలుర వసతి గృహాలు అద్దె గృహాలలో నిర్వహిస్తున్నారు. పక్కా భవన నిర్మాణాల గూర్చి దశాబ్దాలుగా పట్టించుకోకపోగా గత ప్రభుత్వ హయాంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవన నిర్మాణానికి ఎస్సీ కార్పొరేషన్ నుంచి అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ రూ 2 కోట్లు మంజూరు చేయించారు. నిధులు మంజూరు టెండరు ప్రక్రియ పూర్తి కాగా భవన నిర్మాణ పనులకు గత సంవత్సరమే అప్పుడు మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ శంకు స్థాపన చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పిల్లర్లు వరకు నిర్మించి అర్థాంతరంగా వదిలేశారు. ఇప్పటికైనా అర్థాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు చేపట్టి అద్దె గృహాలలో అరకొర వసతుల నుంచి విముక్తులను చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

బిల్లులు రాక పనులు నిలిచిపోయాయి

బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. త్వరలోనే పనులు ప్రారంభించి నిర్మాణం పూర్తి చేయిస్తాం. విద్యార్థులు అవస్థలు పడకుండా చర్యలు తీసుకుంటాం

- దనుంజయ్, ఏఈ

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గంగాధర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గంగాధర కేజీబీవీ పాఠశాలలో తాత్కాలిక పద్ధతిలో అధ్యాపకుల నియమాకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో పూర్ణిమ గౌతమి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో నర్సింగ్, సివిక్స్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. అర్హులైన వారు రెండు రోజుల్లో పాఠశాల పనిదినాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నర్సింగ్ పోస్టుకు ఎమ్మెస్సీ లేదా బీఎస్సీ నర్సింగ్ ఉండాలని, సివిక్స్‌కు ఎంఏ(పొలిటికల్ సైన్స్)తో బీఎడ్ చేసిన వారు అర్హులని తెలిపారు.

రామడుగు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోన్‌రావుపేట కేజీబీవీ కళాశాలలో ఖాళీగా ఉన్న నర్సింగ్ పోస్టును తాత్కలికంగా పనిచేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రత్యేకాధికారి కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో సెప్టెంబరు 2024లో జరిగిన బీఎస్సీ ఆనర్స్ డిజైన్ అండ్ టెక్నాలజీ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ యు శ్రీరంగ ప్రసాద్ విడుదల చేశారు. ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని అన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన ఎస్‌యూ వీసీ

గణేశ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్, లా కళాశాలలు ఏర్పాటు చేయడానికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం సచివాలయంలో ఎస్‌యూ వీసీ ఉమేష్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని వీసీ తెలిపారు.

గుర్తింపు దక్కేదెన్నడో..?

విధి నిర్వహణలో హోంగార్డులు పోలీసులకు ఏ మాత్రం తీసిపోరు. ఎండనకా, వాననకా రోడ్లపై పోలీసులతో సమానంగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత కల్పించడం లేదు. చాలీచాలని వేతనాలతో జీవితాలను వెల్లదీస్తున్నారు. ఏళ్ల తరబడి గుర్తింపునకు నోచుకోవడం లేదు. పోలీసు శాఖకు అనుబంధంగా పనిచేస్తున్నా హోంగార్డుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. **డిసెంబరు 6న హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..**





- పోలీసులతో సమానంగా విధులు
- అరకొర వేతనాలతో ఇక్కట్లు
- పట్టించుకోని ప్రభుత్వం
- నేడు హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసులు నిర్వహించే ట్రాఫిక్, సివిల్ విధులతో పాటు అధికారుల వాహనాలకు డ్రైవర్లుగా, పోలీసు కార్యాలయాల వద్ద విధులను హోంగార్డులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో హోంగార్డులకు డ్రెస్, ఫుడ్, యూనిఫాం అలవెన్స్‌లు ఐదేళ్ల నుంచి పెండింగ్‌లోనే ఉన్నాయి. బెల్ట్, షూస్, సాక్స్, విజిల్‌కార్డు, క్యాప్‌లను 2015 నుంచి ఇవ్వడం లేదు. 2016 నుంచి కారుణ్య నియామకాలను నిలిపివేశారు. పోలీసులకు కల్పిస్తున్న సౌకర్యాలన్నిటిని హోంగార్డులకు కల్పించాలని 2015లో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. చనిపోయిన హోంగార్డు కుటుంబానికి 10 లక్షలు నగదుతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నారు. పదవీ విరమణ పొందిన సమయంలో 5 లక్షలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని హోంగార్డులు ప్రభుత్వాన్ని, పోలీసుశాఖను కోరుతున్నారు.

● ఉమ్మడి జిల్లాలో 1,280 మంది హోంగార్డులు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,280మంది హోంగార్డులు ఉన్నారు. హోంగార్డులు పోలీసు శాఖకు అనుబంధంగా పనిచేస్తున్నారు. కొంత మంది అగ్నిమాపకశాఖ, రవాణాశాఖ, కోర్టు, ఆర్టీసీ, ఎఫ్‌సీఐ, ఎండోమెంట్, రైల్వే తదితర ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి పోలీసు ఠాణాలో 5నుంచి 10మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబ పోషణకు ప్రస్తుత జీతం 27,640 రూపాయలు సరిపోవడం లేదని హోంగార్డులు వాపోతున్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని వారు కోరుతున్నారు.

● స్వచ్ఛంద సంస్థగా ఆవిర్భవించి..

హోంగార్డు వ్యవస్థ దేశ సరిహద్దుల్లో 1946లో పోలీసులకు చేదోడు వాదోడుగా ఉండేందుకు స్వచ్ఛంద దళంగా ఆవిర్భవించింది. ఈ విధంగా ఏర్పాటైన హోంగార్డు వ్యవస్థను కాలక్రమేణా పోలీసుశాఖకు అనుబంధంగా కొనసాగిస్తూ 1962-63లో హోంగార్డులకు దినసరి వేతనాలు అందజేశారు. ఆ తరువాత నెలసరి వేతనాలు చెల్లిస్తున్నారు. కానీ నేటి వరకు ఉద్యోగం శాశ్వతం కాకపోవడంతో ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలు సరిపోవటం లేదని హోంగార్డులు వాపోతున్నారు. కొంతమంది పోలీసు ఉన్నతాధికారులు తమ ఇళ్లలో హోంగార్డులతో వెట్టిచాకిరి చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

● పర్మినెంట్ చేయాలని డిమాండ్

హోంగార్డులను పర్మినెంట్ చేసి వేతనాలను పెంచాలని వారు కోరుతున్నారు. పోలీసులకు చెల్లించే భత్యాలు వర్తింపజేయాలని, వారంలో ఒక సెలవు కల్పించాలని, బస్‌పాస్‌లు, ఆరోగ్య కార్డులను అందించాలని డిమాండ్ చేస్తున్నారు. మహిళా హోంగార్డులకు ఒక నెల వేతనంతో కూడిన ప్రసూతి సెలవు కల్పించాలని కోరుతున్నారు. ఐదు సంవత్సరాల సర్వీసు కలిగిన హోంగార్డులకు కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించి శిక్షణ ఇవ్వాలని విన్నవించుకుంటున్నారు. కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపికలో 30 శాతం హోంగార్డులకు రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతున్నారు.

పోలీస్ సెలెక్షన్‌లో రిజర్వేషన్ కల్పించాలి

- ఒక హోంగార్డు

హోంగార్డులకు కానిస్టేబుల్ సెలెక్షన్‌లో రిజర్వేషన్ కోటాను అమలు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. పోలీసులకు కల్పిస్తున్న అన్ని రకాల సౌకర్యాలు హోంగార్డులకు అమలు చేయాలి.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి మండలంలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు గురువారం హాజరయ్యారు. కోరెం నుంచి నల్గొండ వరకు చేపట్టనున్న రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం బోయినపల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో విద్యారం గాన్ని నీరుగార్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖను బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. చదువుతోపాటు, ప్రైవేటు స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేశారన్నారు. ప్రతీ నియోజక వర్గంలో దశల వారీగా ట్రైనింగ్ సెంటర్ లను ప్రారంభించనున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో చొప్ప దండి నియోజకవర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతుందన్నారు. బోయినపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలను ప్రస్తుతం ఉన్న పాఠశాల మొత్తం శిథిలావస్థకు చేరుతోందని, తన దృష్టికి రాగానే స్వయంగా సందర్శించి పాఠశాలను ఉన్న సమస్యలు తెలుసుకున్నానని అన్నారు. కలెక్టర్‌కు సమస్యలు చెప్పగానే నిధులు మంజూరు చేశారన్నారు. పాఠశాల పూర్తిస్థాయిలో రూపు దిద్దుకుందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. డీఈవో జగన్‌మోహన్ రెడ్డి, సీఈవో వినోద్, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో జయశీల, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, ఉమ్మడి జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మాజీ ఎంపీపీ వేణుగోపాల్, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, మండల విద్యాధికారి శ్రావణ్, ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కొడిమ్యాల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు గురువారం రాత్రి ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం పండితులు వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పండితులు గ్రామస్థులు, భక్తులు ఉత్సవ మూర్తులను గ్రామ చివర నుండి ఊరేగింపుగా యువతీ యువకులు నృత్యాలు చేస్తూ ఆలయానికి తీసుకవచ్చారు. గోవింద నామస్మరణతో అడుగడుగునా భక్తి శ్రద్ధలతో మంగళహారతులతో స్వామి వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ రాజు



మాట్లాడుతున్న ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు

భగత్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళా ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు అన్నారు. కరీంనగర్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో గురువారం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంతో పాటు, తెలంగాణలో కరీంనగర్ రీజియన్ ఎప్పుడూ ఉన్నత స్థానంలోనే నిలిచిందన్నారు. ఆర్టీసీలో కారుణ్య నియమకాలు త్వరితగతిన జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్‌లు కెసత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, డిపో మేనేజర్లు విజయమాధురి, మల్లయ్య, పర్సనల్ ఆఫీసర్ ఎంచంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ జి మనోహర్‌రెడ్డి, అసిస్టెంట్‌ట్రాఫిక్ మేనేజర్ సురేష్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఆర్ఎంను కలిసిన డిపో మేనేజర్లు

రీజియన్ మేనేజర్ రాజును గురువారం డిపో మేనేజర్లు మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్లు కెసత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, డిపో మేనేజర్లు నాగభూషణం, వెంకటేశ్వర్లు, రవీంద్రనాథ్, విజయమాధురి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

జగిత్యాలరూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణానికి చెందిన పూటూరి దినేష్‌కుమార్(52) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు దినేష్‌కుమార్ జగిత్యాల పట్టణంలో గత 20 సంవత్సరాలుగా లేడీస్‌ఎంపోరియం దుకాణం నడుపుతూ జీవిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా దుకాణం సక్రమంగా నడవకపోవ డంతో దినేష్ కుమార్ ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందిపడుతూ మనోవే దనకు గురవుతున్నాడు. మంగళవారం జగిత్యాల మండలం తిప్పన్నపేట శివారులో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. దినేష్‌కుమార్ కుమారుడు సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

నవ వధువు ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన జక్కుల శ్రీలేఖ (23) అనే నవ వధువు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. శ్రీలేఖకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా జగద్గిరిగుట్టకు చెందిన పృథ్వీధర్‌రావుతో నవంబరు 7న వివాహం జరిగింది. నవంబరు 27న శ్రీలేఖ తండ్రికి అత్తింటివారు ఫోన్ చేసి జగద్గిరి గుట్టకు రావాలన్నారు. ఆయన అక్కడికి వెళ్లగా శ్రీలేఖను పుట్టింటికి తీసుకువెళ్ళమని చెప్పి పంపించారు. పెళ్లయిన 20 రోజులకే అత్తింటి వారు పుట్టింటికి పంపించి వేయడంతో మనస్థాపం చెందిన శ్రీలేఖ డిసెంబరు 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించిగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. శ్రీలేఖ తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

- ఎస్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి



మాట్లాడుతున్న ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రితో ఉపాధ్యాయ సంఘాల సమావేశం సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెండింగ్ బిల్లులు అన్ని క్లియర్ చేయాలని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షుడు మేరుగు సతీష్ అధ్యక్షతన ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశాలకు ముఖ్యఅతిథిగా పర్వతరెడ్డి హాజరై మాట్లాడారు. నూతన ప్రభుత్వ ఏర్పాటు అనంతరం ఒకటవ తారీఖు వేతనం తిరిగి ప్రారంభం అవడం, బదిలీలు పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయడంతో మిగతా అన్ని సమస్యలు కూడా ఒక్కొక్కటి పరిష్కారం అవుతాయని ఉపాధ్యాయులు ఎంతో నమ్మకంతో ఇప్పటివరకు ఎదురుచూసారన్నారు. కానీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉండి పరిష్కారానికి నోచుకోకపోవడం వలన ఉపాధ్యాయులు తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురి అవుతున్నారన్నారు. ప్రధానంగా పెండింగ్ బిల్లులు మంజూరుకాక ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అనారోగ్య సమస్యల కారణంగా లక్షల రూపాయలు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకొని పెట్టిన మెడికల్ బిల్లులు, సరెండర్ బిల్లులు, పిల్లల పెళ్లిళ్ల కోసం పెట్టిన జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ బిల్లులు, సప్లిమెంటరీ బిల్లులు, డీఏ ఏరియర్స్ బిల్లులు ఏవీ కూడా సకాలంలో మంజూరుకావడం లేదన్నారు. పదేపదే బిల్లులు చేస్తూ సబ్మిట్ చేయడం సంవత్సరం దాటినా వాటికి మోక్షం కలగకపోవడం శోచనీయమన్నారు. రిటైర్మెంట్ అయిన వారికి రిటైర్మెంట్ తేదీ నాటికి అన్ని బిల్లులు చెల్లించాల్సి ఉండగా సంవత్సర కాలం గడిచినా ఎలాంటి చెల్లింపులు చేయలేదన్నారు. దీంతో పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఆందోళనలకు గురి అవుతూ విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. పెండింగ్ బిల్లుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి పదేపదే తీసుకవెళ్తున్నా ఇంకా సమస్య అలాగే ఉందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెండింగ్ బిల్లులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి మందల శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నడిపెల్లి సంతోష్ కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి జి. మాధవాచారి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి తోట రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నింటి తిరుపతిరావు, దాసరి శ్రీధర్, సీనియర్ నాయకులు ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఫయాజుద్దీన్, సుంకె నర్సింగమ్, మోతె సమ్మయ్య, గంధం రాజేందర్, కుసుమ దేవేందర్, గుండా మల్లిఖార్జున్, దాతు సదానందం తదితరులు పాల్గొన్నారు.

బంగారు పతకాలు అందుకున్న విద్యార్థి

- ఒడిశా గవర్నర్ చేతుల మీదుగా ప్రదానం

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణానికి చెందిన న్యాయవాది ఎలేటి నరేందర్‌రెడ్డి-వందనల కూతురు ఎలేటి వర్షారెడ్డి అగ్రికల్చర్ ఎమ్మెస్సీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందకు రెండు బంగారు పతకాలు అందుకుంది. ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ఉన్న వ్యవసాయ సాంకేతిక పరిశోధన సంస్థలో ఎమ్మెస్సీ అగ్రికల్చర్ చదివిన వర్షారెడ్డి అత్యున్నత ప్రతిభ కనబర్చి రెండు బంగారు పతకాలను సాధించింది. ఈ సందర్భంగా గురువారం జరిగిన స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ రఘువరన్‌దాసు, ఒడిశా ఉప ముఖ్యమంత్రి వర్ధన్ సింగ్, వైస్ ఛాన్సలర్ ప్రభాత్ కుమార్‌ల చేతుల మీదుగా వర్షారెడ్డి బంగారు పతకాలు అందుకుంది. వర్షారెడ్డిని కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

ఆర్టీసీలో బస్సుల సంఖ్య పెంచాలి

- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో అధికారులకు వినతి

భగత్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో జమ్మికుంట రూట్‌లో బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతూ పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ ఆధ్వర్యంలో గురువారం వన్ డిపో ట్రాఫిక్ సీఐ హిమబిందుకు వినతిపత్రం అందించారు. వీణవంక, చల్లూరు, పచ్చునూరు గ్రామాల నుంచి నిరుద్యోగులు కరీంనగర్‌లోని ప్రైవేట్ షాపుల్లో కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. రాత్రి సమయాల్లో బస్సులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రతి 30నిమిషాలకు ఒక బస్సును నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని, వీణవంక మండల కేంద్రంలో ఆర్టీసీ సిబ్బంది పర్యవేక్షణ కోసం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రచన, పరుశురాం, శ్రీకాంత్, సృజన్, సునీల్, తిరుమల, శంరమ్మ, అజయ్, శ్రీనివాస్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ భర్తపై దాడి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ గొడవలో సర్ది చెప్పేందుకు వెళ్లిన కార్పొరేటర్ భర్త కత్తిపోట్లకు గురయ్యాడు. ఈ సంఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూ టౌన్ పోలీసులు తెలిపారు. కరీంనగ్‌లోని కాశ్మీర్‌గడ్డకు చెందిన అక్రం, ఆజాన్, అతిల్ ముగ్గురు సోదరులకు మధ్య గత కొంతకాలంగా కుటుంబ గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 3న జరిగిన గొడవలో ఆజాం, అక్రం కలిసి అతిల్‌పై దాడి చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ భర్త అయిన అతీనా అతిల్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. తన సోదరుడు అతీల్‌కు మద్దతు ఇస్తున్నాడని కార్పొరేటర్ భర్త అతీనాపై ఆజాం, అక్రం కక్ష పెంచుకున్నారు. ఈ నెల 4న రాత్రి ముగ్గురు సోదరుల మధ్య మరోసారి గొడవ జరిగింది. విషయం తెలుసుకున్న అతీనా అక్కడకు చేరుకొని ఆజాం, అక్రంలకు సర్ది చెప్పేందుకు యత్నించాడు. దీంతో అతీనాపై కత్తితో దాడి చేశారు. గాయపడ్డ అతీనాను ఆసుపత్రికి తరలిచారు. అతీనా సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుపై ఆజాం, అక్రంపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సారవంతమైన నేలను అందించాలి

- తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

జమ్మికుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వ్యవసాయ రంగం పరంగా నేల తల్లిని కాపాడుకోవడంతో పాటు భవిష్యత్తు తరాల వారికి సారవంతమైన భూమి అందించడం అందరి లక్ష్యంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో గురువారం ప్రపంచ నేల దినోత్సవం, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ప్రారంభోత్సవం, గ్రామ నవ నిర్మాణ సమితి స్వర్ణోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కోదండరెడ్డి మాట్లాడారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని కాపాడుకోవాలని కోరారు. రైతు సంక్షేమ సంఘాలు ప్రకృతి వ్యవసాయంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాలు కూడా దీనిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. మానవాళికి ప్రకృతి ప్రసాదించిన సహజ వనరుల్లో నేల ఒకటని చెప్పారు. నేల మనకు కన్నతల్లితో సమానమన్నారు. ప్రస్తుత వ్యవసాయ రంగం పరంగా నేల తల్లిని కాపాడుకోవడంతో పాటు భవిష్యత్తు తరాల వారికి సారవంతమైన భూమి అందించడం అందరి లక్ష్యంగా ఉండాలని సూచించారు. ఆ దిశగా వెళ్లాలంటే రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. హైదరాబాద్ అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వ్యవసాయ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిచాలని కోరారు. ఐక్యరాజ్య సమితి సంస్థ ద్వారా యేటా డిసెంబరు 5వ తేదీన నిర్వహించే ప్రపంచ నేల దినోత్సవంలో భాగంగా ఈ ఏడాది మట్టి గణాంకాల సేకరణ, పర్యవేక్షణ, నిర్వహణపై దృష్టి పెట్టాలని అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగహన కల్పించడం కోసం దేశవ్యాప్తంగా 731కృషి విజ్ఞా కేంద్రాలు, 3వేల కృషి సఖిల (మహిళల) ద్వారా శిక్షణ ఇచ్చే విధంగా 10వేల జీవ వనరుల కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్‌ను తెలంగాణలో మొట్ట మొదటి సారిగా జమ్మికుంట కేవీకేలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యవసాయం, రైతు సంక్షేమ సంఘం సభ్యులు భవానిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తరుపున కూడా రైతు లకు సహాయం అందించాలని, ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా ప్రోత్సహించాలని కోరారు. కేవీకే ప్రధానకార్యదర్శి విజయ్ గోపాల్‌రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్‌ను జమ్మికుంట, సైదాపూర్ మండలాల్లోని ఎనిమిది గ్రామాల్లో 6,340మంది రైతులతో 10వేల ఎకరాల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ పి కుమారస్వామి పాల్గొన్నారు.

వర్గీకరణ అమలుకు మాదిగల మహార్యాలీ

మల్లాపూర్, డిసెంబరు, 5 (ఆంధ్రజ్యోతి): మాదిగ ఉపకులాల ఆధ్వర్యంలో గురువారం మల్లాపూర్‌లో వర్గీకరణ అమలు కోరుతూ మహార్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన మాదిగ ఉపకులాల సభ్యులు స్థానిక వెంకటేశ్వరాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లినారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ఎస్సీల ఉమ్మడి రిజర్వేషన్లు ఏబీసీడీలుగా వర్గీకరణ చేయాలని కోరుతూ తహసీల్దార్ వీర్‌సింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. రిజర్వేషన్ వర్గీకరణ ఒక్కటే మాదిగలకు న్యాయంను తహసీల్దార్ ద్వారా ప్రభుత్వంకు విన్నవిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏంఆర్‌ఎస్ నాయకులు, అంబేద్కర్ సంఘం నాయకులు, ఆయా గ్రామాల మాదిగ కుల సంఘాల సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో ర్యాలీ చేపడుతున్న మాదిగ సంఘం సభ్యులు

న్యూస్ బాక్స్

గుడికి బోర్‌వెల్ సౌకర్యం

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 5, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పాండవుల గుట్టపై నిర్మించే అయ్యప్ప దేవాలయానికి కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన భక్తుడు పిల్లల మర్రి విజయలక్ష్మీరాములు సొంత ఖర్చుల తో బోర్‌వెల్ వేయించాడు. గురువారం వేద పండితుల మంత్రోచ్ఛరణలతో బోర్‌వెల్ నీటి వాడకం ప్రారంభించారు. కార్యక్రమం లో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టే వరకు ఉద్యమం..

సుల్తానాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కులాల వర్గీకరణ బిల్లును అసెంబ్లీ పెట్టే వరకు ఉద్యమించాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి గుండా థామస్ మాదిగ పిలుపునిచ్చారు. సుల్తానాబాద్‌లో గురువారం ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 12న మండల కమిటీ నియామకం ఉంటుందని, సమావేశానికి అన్ని గ్రామాల నుంచి మాదిగలు అధిక సంఖ్యలో తలిరావాలన్నారు. మాలల గర్జన సభ నిర్వహించిన ఎమ్మెల్యే వివేక్ మంత్రి పదవి కోసమేనని విమర్శించారు. మందకృష్ణ మాదిగను విమర్శించే నైతికహక్కు వివేక్‌కు లేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు శంకర్, తాండ్ర అంజయ్య, సంకెనపల్లి లక్ష్మణ్, అట్లూరి గంగారం, రాజమల్లు, తిరుపతి, శంకర్ ఉన్నారు.

ఉచిత దంతవైద్య శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవాణి స్కూల్‌లో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం జరిగింది. విద్యార్థులు, పోషకులకు వైద్యులు దంత పరీక్షలు నిర్వహించారు. దంతాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ లక్ష్మణ్‌కుమార్, ప్రిన్సిపాల్ మానస, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నది.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తేజస్విని


పెద్దెల్లి తేజస్విని

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోదావరిఖనికి చెందిన పెద్దెల్లి తేజస్వినిప్రకాష్ గెలుపొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా కృషి చేస్తానని, ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించనున్నట్టు తెలిపారు. తన గెలుపు కోసం సహకరించిన ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అజయ్

సుల్తానాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ మండల యూత్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా కాట్నపల్లి గ్రామానికి చెందిన ఒర్రె అజయ్‌ను నియమించారు. అజయ్ గురువారం ఎమ్మెల్యే విజయరమణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్ లో అజయ్ విలేకరులతో మాట్లాడారు. సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు మినుపాల ప్రకాష్‌రావు, రైస్‌మిల్లర్ల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు దన్నమనేని ఆనందరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిలుక సతీష్ తదితరులు ఉన్నారు.

రియాజ్ అహ్మద్‌పై దాడి అనైతికం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌పై దాడిని ఖండిస్తున్నట్టు హెచ్ఎంఎస్ ఆర్జీ-2 వైస్‌ప్రెసిడెంట్ దావు రమేష్ ప్రకటనలో పేర్కొన్నారు. దాడికి యత్నించిన ఎల్లయ్యపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చిచ్చరపిడుగులు..

- కరాటే పోటీల్లో సుల్తానాబాద్ విద్యార్థుల ప్రతిభ
- అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న హర్షవర్ధన్, అభిరామ్



కరాటే పోటీల్లో పతకాలు, మెరిట్ అవార్డు సాధించిన హర్షవర్ధన్(ఫైల్)


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్(ఫైల్)

సుల్తానాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిన్న నాటి నుంచే మార్షల్ ఆర్ట్స్‌పై మక్కువ పెంచుకున్న ఇద్దరు చిన్నారులు కరాటేలో సత్తా చాటుకుంటున్నారు.. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన జింజిరి హర్షవర్ధన్, ఇప్ప అభిరామ్‌లు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధిస్తున్నారు. మంకీ ఫిస్ట్ కుంగ్ ఫు చైనీస్ మార్షల్ ఆర్ట్స్‌లో గ్రాండ్ మాస్టర్ సీహెచ్ మదన్ కుమార్, సీనియర్ మాస్టర్ రాజయ్య, కోచ్, మాస్టర్ జి. సతీష్‌ల వద్ద ఐదారేళ్లుగా వీరిద్దరూ శిక్షణ పొందుతున్నారు. హర్షవర్ధన్ స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతుండగా, అభిరామ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం కఠోర సాధన చేస్తూ తమలోని నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకుంటున్నారు. ఇప్పటివరకు మొత్తం ఇరవై రెండు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొన్న హర్షవర్ధన్‌కు 48 బంగారు, 8 సిల్వర్, 2 బ్రాంజ్ పతకాలు సాధించగా, అభిరామ్‌లు 6 బంగారు పతకాలు, 2 సిల్వర్, 2 బ్రాంజ్ మెడల్స్ సాధించాడు.

● **కలెక్టర్ ప్రశంసలు..**

కరాటే పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించిన హర్షవర్ధన్, అభిరామ్‌లను గతంలో ఇక్కడ పనిచేసిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అభినందించి సత్కరించారు. ఇలాగే మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు.

నేల స్వభావాన్ని బట్టి పంటలు వేసుకోవాలి

- ధర్మారం వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

ధర్మారం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) రైతులు రసాయనిక మందులు వాడకుండా, ప్రకృతి సేద్యం వైపు ఆసక్తి చూపాలని, నేలల స్వభావాన్ని బట్టి పంటలు వేసుకోవాలిని ధర్మారం వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ తెలిపారు. ప్రపంచ నేల దినోత్సవ వేడుకలను పంటపొలాల్లో రైతులతో కలిసి నిర్వహించారు. ఈసందర్భంగా పంటపొలాల్లోని మట్టి నమూనాలను రైతుల నుంచి సేకరించారు. భూసార పరీక్షల ద్వారా మట్టిలో భాస్వరం, నత్రజని, పొటాష్, సూక్ష్మ పోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో తెలుస్తుందని, ఫలితాల అనుగుణంగా పంటలు వేస్తే రైతులు మంచిదిగుబడి సాధించవచ్చని ఆశభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దొంగతుర్తి క్లస్టర్ వినిత్, ఏఈఓ కటికెనపల్లి క్లస్టర్ సతీష్, ఏఈఓ ధర్మారం క్లస్టర్ అఖిల, ఏఈఓ మల్లాపూర్ క్లస్టర్ శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో గురువారం ప్రపంచ నేలల దినోత్సవంను పురస్కరించుకొని రైతులుకు సేంద్రియ వ్యవసాయంపై రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే పంటలను పండించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఉమాపతి, ఏఈవో గణేష్, మాజీ సర్పంచ్‌లు అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కొండ తిరుపతిగౌడ్, రైతులు పుల్లారావు, వెంకటేశ్వర్‌రావు, కవ్వంపల్లి అంజయ్య, బాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

● ముత్తారం (ఆంధ్రజ్యోతి):ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవం సందర్భంగా మండలంలోని ముత్తారం, ఖైదంబండ, ఖమ్మంపల్లి రైతు వేదికల్లో నేల ఆరోగ్యం, మట్టినమూనా సేకరణ పరీక్ష విధానం.. సాయిల్ హెల్త్ కార్డు లాభాలు.. దానిని అనుసరించి ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. అదే విధంగా పంట అవశేషాలను కాల్చడం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనుష, వ్యవసాయ విస్తరణ అధికారులు మనీషా, హారిక, శ్రీలేఖ, రైతులు పాల్గొన్నారు.

● పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): రైతులు నేలల స్వభావాన్ని బట్టి పంటలు వేసుకోవాలని, రైతులందరూ రసాయనిక మందులు వాడకుండా ప్రకృతి సేద్యం వైపు ఆసక్తి చూపాలని పాలకుర్తి మండల వ్యవసాయశాఖ అధికారి బండి ప్రమోద్ కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని అన్ని రైతు వేదికల్లో ప్రపంచ నేల దినోత్సవంపై అవగాహన సదస్సులు నిర్వహించడంతోపాటు క్షేత్ర స్థాయిలో మట్టి నమూనాలు తీసే పద్ధతి పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు పొలాల్లో మట్టి నమూనాలు స్వచ్ఛందంగా అందించి మట్టి పరీక్షలు చేసుకోవాలన్నారు. మట్టిలో వుండే పోషకాలు ఏమిటి?సాగు భూములు బాగుండాలంటే వాటిని ఎలా నిర్వహించుకోవాలి? అనే విషయాలపై ప్రతి రైతు శ్రద్ధ చూపాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ జయ్యారం క్లష్టర్ ఎం యోజన, పాలకుర్తి ఏఈవో శశిదర్, రైతులు పాల్గొన్నారు.

● అంతర్గాం (ఆంధ్రజ్యోతి): పంటల అనంతరం రైతులు వరి కొయ్యలను, పత్తి కట్టెలను కాల్చకుండా భూమిని దున్ని సారవంతం చేసుకోవాలని అంతర్గాం మండల వ్యవసాయ అధికారి కలువల సతీష్ అన్నారు. గురువారం అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి రైతు వేదికలో ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించి ఈ మేరకు మాట్లాడారు. మట్టి నమూనాల సేకరణ పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువులు, పీఎస్‌బీ వాడకం వలన కలిగే లాభాలను రైతులకి వివరించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి హరీష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

హైవే పనులు షురూ..

(3వ పేజీ తరువాయి)

కాగా, జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మంథని మండలం పుట్టపాక సమీపంలో రింగ్ రోడ్డు, ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. అలాగే రామగిరి మండలం బేగంపట వద్ద ఫ్లైఓవర్ ప్రతిపాదిందించారు. ఈ రహదారి నిర్మాణం ద్వారా మంచిర్యాల, పెద్దపల్లితో పాటు కరీంనగర్, జయశంకర్-భూపాలపల్లి జిల్లాల ప్రజలకు నేషనల్ హైవే రహదారి అందుబాటులోకి రానుంది.

● **ట్రెంచ్ కట్టింగ్ పనులు ప్రారంభం..**

మంచిర్యాల-వరంగల్ జాతీయ రహదారి ఎన్‌హెచ్-163 నిర్మాణానికి సేకరించిన మండలంలోని కన్నాల-పందులపల్లి భూముల్లో జాతీయ రహదారుల అథారిటీ ట్రెంచ్ కట్టింగ్ పనులు ప్రారంభించారు. మంచిర్యాల-వరంగల్-ఖమ్మం జిల్లాలను కలిపే 4 లైన్ల గ్రీన్‌ఫీల్డు నేషనల్ హైవే కోసం సేకరించిన భూములను ఎన్‌హెచ్‌ఆర్‌ఏకి అప్పగించారు. దీంతో ట్రెంచ్ కట్టింగ్ పనులను ప్రారంభించామని, నేషనల్ హైవే నిర్మాణం పనులు సకాలంలో పూర్తి అయ్యేలా జిల్లా యంత్రాంగం వారికి సహకరిస్తామని కలెక్టర్ తెలిపారు.

● **భూముల ధరలకు రెక్కలు..**

జిల్లాలోని మూడు మండలాల పరిధిలో జాతీయ రహదారి నిర్మాణానికి పనులు ప్రారంభమైన నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు దూకుడు పెంచారు. సమీపంలో వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించే పనిలో ఉన్నారు. సాధారణంగా ఎకరాకు రూ.25 నుంచి రూ.40 లక్షల వరకు పలుకుతుండగా, వ్యాపారులు ఏకంగా రూ.కోటిపైగా పెంచారు. రైతులు సైతం తమ భూములకు డిమాండ్ పెరుగుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక దృష్టి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రతి దుకాణానికి ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి ఉండాలని, ప్రత్యేక దృష్టిపెట్టి నగరపాలక సంస్థ ఆదాయాన్ని పెట్టాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందిని ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య విభాగం అధికారులతో ట్రేడ్ లైసెన్సుల జారీపై ప్రత్యేక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, రెవెన్యూ ఆఫీసర్ సునీల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గట్టు శ్రీనివాస్, వెంకన్న, శ్రీధర్, నరోత్తంరెడ్డి, మహేందర్, కుమార్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై విచారణ

కరీంనగర్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదులపై కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో గురువారం డీఎల్‌పీఓ శ్రీనివాస్ విచారణ చేశారు. బొమ్మకల్ గ్రామంలో పలు ఫంక్షన్ హాళ్ళల్లో, గెస్ట్ హౌస్‌ల్లో సౌండ్ పొల్యూషన్‌తో పాటు, ఫంక్షన్ హాళ్ళ నుంచి కట్టె పొయ్యిల పొగ, పార్కింగ్ రోడ్లపై చేస్తున్నారని పలువురు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు ఆయన విచారణ చేపట్టారు. ఫంక్షన్ హాళ్ళల్లో ఆయన తనిఖీ చేసి నిర్వాహకులకు సూచనలు చేశారు. పార్కింగ్ సమస్య, సౌండ్ పొల్యూషన్ లేకుండా చూడాలని ఆదేశించారు.

పశు వైద్య శిబిరాలు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్, చర్లబూత్కూర్, తహెర్ కొండాపూర్ గ్రామాల్లో పివి నర్సింహరావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటి పశు వైద్య కళాశాల కోరుట్ల, జగిత్యాల పశు వైద్య, పశు సంవర్ధక శాఖ కరీంనగర్ వారి సహకారంతో గురువారం పశువులకు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఖనిజ లవణాల మిశ్రమము, సీఓ 1 గడ్డి జాతి కణుపులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశు వైద్యాధికారి వేణుగోపాల్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వినోద్, కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాస్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు డాక్టర్ సకారం, డాక్టర్ అంబిక, శ్రీనివాస్, పశు వైద్యులు రామకృష్ణ, శ్రావణ్,జ్యోత్స, అనిల్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు మరింత మెరుగుపరచాలి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య పనులను మరింత మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్ శానిటేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. పారిశుధ్య పనులను, ప్రజా మరుగుదొడ్లను, చెత్త కలెక్షన్ పాయింట్లను పరిశీలించారు. కూరగాయల మార్కెట్ సమీపంలోని ప్రజా మరుగుదొడ్లు, స్నానపు గదులను పరిశీలించి నిర్వహకులకు పలు ఆదేశాలు జారీ చేశారు. టవర్‌సర్కిల్ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. రేకుర్తిలోని వరద నీటి కాలువను ఇరిగేషన్‌శాఖ అధికారులతో కలిసి సందర్శించి, కాలువకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను దగ్గరుండి శుభ్రం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామపంచాయతీలో డీఎల్‌పీవో విచారణ


విచారణ చేపడుతున్న డీఎల్‌పీవో వేణుగోపాల్

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాఘవపూర్ గ్రామ పంచాయతీలో ఆదాయ పన్ను మాయంపై డీఎల్‌పీవో వేణుగోపాల్‌ను గురువారం విచారణ చేపట్టారు. వ్యాపార పన్ను మాయంపై ఫిర్యాదు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం కావడంతో ఆయన విచారణ చేపట్టారు. రెండు నెలల క్రితం గ్రామ పంచాయతీ పరిధిలోని ఇటుకబట్టీల నుంచి వ్యాపార పన్ను సుమారు 81వేల 300కాగా, ఇతర ఇంటి పన్నులు 60వేలను బిల్ కలెక్టర్ బుచ్చయ్య వసూలు చేసి స్వంతానికి వినియోగించుకున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతికి చెల్లిస్తున్న ఇంటి, వ్యాపార పన్నులను వసూలు చేసి స్వంతంగా వినియోగించుకున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈసందర్భంగా విచారణలో లక్షా41వేల 300 కాజేసినట్లు నివేదిక తయారు చేశామని, అలాగే ఇప్పటికి కూడా ఇటుక బట్టీల నిర్వాహకుల నుంచి డబ్బులు వసూలు చేసే విషయం తన దృష్టికి వచ్చిందని, ఈ మేరకు నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు.

రేపు కాటారంలో ధర్మ యుద్ధ మహాసభ

కమాన్‌పూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జయయశంకర్ జిల్లా కాటారం మండలకేంద్రంలో ఈనెల 7న నిర్వహించ తలపెట్టిన దళితబంధు ధర్మ యుద్ధ మహాసభను విజయవంతం చేయాలని దళిత బంధు సాధన సమితి నాయకులు కోరారు. మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. అర్హులైన దళితులకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబటి కనకయ్య, దాసరి రామస్వామి, చిప్పకుర్తి సత్యనారాఆయణ, ఆవునూరి రాయలింగం, కూనమల్ల రాయనర్సు, మట్ట నర్సయ్య, అగ్గిమల్ల నర్సయ్య, దాసరి రామచంద్రంలు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం


బహుమతులను అందజేస్తున్న ఎంఈవో విజయ్‌కుమార్

కమాన్‌పూర్, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థుల ఆటల పోటీలను నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో విజయ్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు లక్ష్మీనారాయణ, ఖలీదాబేగం, ఇన్‌చార్జి హెచ్ఎం సరళ, పంచాయతీ కార్యదర్శి కానిగంటి రాజ్‌కుమార్, భవిత సెంటర్ ఉపాధ్యాయురాలు శారదా, పీఈటీ రేణుకలు ఉన్నారు.

కాగా, మండల కేంద్రంలోని 15 మంది నిరుపేద కుటుంబాలకు గురువారం శ్రీ సత్యసాయి సేవాదల్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. సరుకులను కమాన్‌పూర్ లైన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి, సత్యసాయి సేవాదళ్ ప్రతినిధి నూక రమేష్‌లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, పోన్నం నవీన్‌కుమార్, బొజ్జ నరసింహచారి, లక్ష్మణ్, లక్ష్మణామూర్తిలు పాల్గొన్నారు.



ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్ నాయకుల ఘర్షణ

- ఎస్ఓటూ జీఎం చాంబర్‌లోనే వివాదం..

గోదావరిఖని, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్మిక సమస్యలు, కష్టాల విషయంలో అధికారులను నిలదీయాల్సిన కార్మిక నాయకులు అధికారుల ముందే ఘర్షణ పడి అబాసుపాలు అవుతున్నారు.. రౌడీషీటర్లు.. బ్రోకర్లు అంటూ ఒకరినొకరు దూషించుకుంటూ అధికారుల చాంబర్‌లో ఒకరిపై ఒకరు కుర్చీలు లేపుకున్నారు... ఈ ఘటన గోదావరిఖని ఆర్‌జీ-1 జనరల్ మేనేజర్ కార్యాలయంలో గురువారం చోటుచేసుకున్నది. ఇటీవల సింగరేణి సివిల్ విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఉద్యోగులు సింగరేణి హెడ్ వర్క్స్ వద్ద మద్యం సేవించిన ఘటనపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో విజిలెన్స్ విచారణ జరిగింది. యాజమాన్యం వర్క్‌ఇన్‌స్పెక్టర్ పూజారి శ్రీనివాస్‌తో పాటు రాఘవరెడ్డి, తుమ్మ రవిలను పది రోజులు సస్పెండ్ చేసి వెంకటరమణకు చార్జిషీట్ ఇచ్చింది. సస్పెండ్ అయిన ఉద్యోగులు జీఎంను కలిసి మొదటి తప్పుగా క్షమించాలని, భవిష్యత్‌లో పునరావృతం కాదని చెప్పడంతో రెండు రోజులకు కుదించి విచారణకు ఆదేశించారు. వెంకటరమణ అనే ఉద్యోగికి సంబంధం లేకున్నా చార్జిషీట్ ఇచ్చారంటూ హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ గురువారం డీజీఎం(పర్సనల్) కిరణ్ రాజుతో మాట్లాడారు. ఆ సమయంలో అదే గదిలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య కూడా ఉన్నారు. రియాజ్ అహ్మద్ మాటల్లో గుర్తింపు నాయకుల గురించి పేర్కొనడంతో వివాదంతో మొదలైంది. రియాజ్ అహ్మద్, మడ్డ ఎల్లయ్యలు ఒకరికొకరు దూషించుకున్నారు. కుర్చీలు ఎత్తేవరకు వెళ్లింది. దీంతో అధికారులు వారించారు. మడ్డి ఎల్లయ్య గది నుంచి బయటకు వచ్చి ఒకరికొకరు దూషించుకున్నారు. ఒకరు రౌడీషీటర్ అంటే, మరొకరు బ్రోకర్ అంటూ నిందించుకోవడమే కాకుండా కొట్లాటకు ప్రయత్నించారు. సెక్యూరిటీ సిబ్బంది జోక్యం చేసుకుని గదికి తలుపు పెట్టారు. మడ్డి ఎల్లయ్యను బయటకు తీసుకువచ్చారు.

కాగా ఘటనపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లయ్య తెలిపారు. కాగా ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లయ్య రౌడీయిజాన్ని ప్రదర్శించారని, రియాజ్‌పై దాడికి ప్రయత్నిచారని హెచ్ఎంఎస్ నాయకులు కొమురయ్య, ఖయ్యూం, క్రాంతి కుమార్ ఆరోపించారు. అతనిపై రౌడీ షీట్ తెరవాలని డిమాండ్ చేశారు.

7ఎల్ఈపీ గనిని సందర్శించిన ఏఎల్‌సీ


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎల్‌సీ


సత్యనారాయణ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీడీకే 7ఎల్ఈపీ గనిని గురువారం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మహమ్మద్ యూసుఫ్ సందర్శించారు. మంగళవారం హెడ్ ఓర్‌మ్యాన్ సత్యనారాయణ ప్రమాదవశాత్తు ఇసుక బంకర్‌లో పడి మృతిచెందిన ఘటనపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాద స్థలాన్ని ఏఎల్‌సీ పరిశీలించారు. ఈసందర్భంగా మృతుడు సత్యనారాయణ కుటుంబానికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు, ఇతరత్రా త్వరగా అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఏఎల్‌సీ వెంట ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య, వీకేపీ ప్రాజెక్టు అధికారి నెహ్రూ, గ్రూప్ ఇంజనీర్ చంద్రశేఖర్, అఫీషియేటింగ్ మేనేజర్ చంద్రకుమార్, డీవైపీఎం శ్యాంప్రసాద్, ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

7ఎల్ఈపీ ప్రమాదంలో మృతిచెందిన తీట్ల సత్యనారాయణ కుటుంబాన్ని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య పరామర్శించారు. గురువారం సత్యనారాయణ ఇంటికి వెళ్లిన జీఎం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సత్యనారాయణ మృతి బాధాకరమని పేర్కొన్నారు. కుటుంబానికి రావాల్సిన బెనిఫిట్స్ వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. సింగరేణి యాజమాన్యం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. జీఎం వెంట ఆర్జీ-2 ముఖ్య అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు జీ రవీందర్, శ్యాంసన్ తదితరులు ఉన్నారు.

హెడ్ ఓర్‌మ్యాన్‌కు నివాళులర్పించిన కార్మికులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జీడీకే 7 ఎల్ఈపీలో ప్రమాదవశాత్తు మరణించిన హెడ్ ఓవర్‌మెన్ సత్యనారాయణకు గురువారం ఓసీపీ-1 ప్రాజెక్టు కార్మికులు నివాళులు అర్పించారు. సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని సైటాఫీస్ ఆవరణలో జరిగిన సంతాప సభలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఓసీపీ-1లో ఓర్‌మ్యాన్‌గా పనిచేసి ఉత్తమ సూపర్‌వైజర్‌గా గుర్తింపు పొందిన సత్యనారాయణ బదిలీపై 7ఎల్ఈపీకి వెళ్లినట్టు మేనేజర్ ఉదయ్ హరిజన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతి యాదవ్, సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాసరావు, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల పిట్ సెక్రెటరీలు తిరుపతిరావు, వెంకటస్వామి, హెచ్ఎంఎస్, పిట్ సెక్రెటరీ మల్లారెడ్డితో పాటు సూపర్‌వైజర్లు కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

కరీంనగర్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో సంజీవరావు అన్నారు. గురువారం కరీంనగర్ మండలంలో ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా బొమ్మకల్ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో మురికి కాలువల్లో చెత్తను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్‌తో పాటు ఎంపీడీవో సంజీవరావు దగ్గరుండి తొలగించారు. వాటర్ ట్యాంకులను శుభ్ర పరిచి క్లోరినేషన్ చేయించారు. బోర్లను రిపేరు చేపించారు. తహెర్ కొండాపూర్‌లో కార్యదర్శి ప్రవళ్ళిక ఆధ్వర్యంలో ట్యాంక్‌లను శుభ్రపరిచారు. నగునూర్ గ్రామంలో కార్యదర్శి లచ్చయ్య ఆధ్వర్యంలో బొమ్మకల్ గ్రామంలో కార్యదర్శి హిదయతుల్లా ఆధ్వర్యంలో చెత్తను తొలగించారు.

● **నామమాత్రంగా ప్రజాపాలన సంబరాలు**

కరీంనగర్ మండలంలో ప్రజా పాలన సంబరాలను కొన్ని గ్రామాల్లో నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. తహెర్ కొండాపూర్, బొమ్మకల్, దుర్శేడ్, నగునూర్ గ్రామాల్లో మినహా మిగతా గ్రామాల్లో నామమాత్రంగానే నిర్వహిస్తున్నట్లు తెలిసింది. పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు నామమాత్రంగా చేపడుతున్నప్పటికీ సంబంధిత కార్యదర్శులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వాలీబాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి ఎంపిక

భగత్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థి అక్షిత్‌రెడ్డి ఎంపికయ్యాడు. గురువారం పాఠశాలలో విద్యార్థిని అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడం హర్షించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

'పేదలకు సంక్షేమ ఫలాలు అందించాలి'

సుభాష్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమ ఫలాలు అందించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీలకు విద్య, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి ఇవ్వాలనే డిమాండ్ల సాధనకు కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ ప్రజలు ప్రభుత్వానికి వేలకోట్ల రూపాయలు ట్యాక్స్‌ల రూపంలో కడుతున్నారన్నారు. ఆ డబ్బును విద్య, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో అత్యాధునిక స్కూలు, కాలేజీ నిర్మించాలన్నారు. అర్హులైన వారికి నీటి వసతి ఉన్న ఎకరం భూమిని ఇవ్వాలని, 200 గజాలలో నాలుగు గదుల ఇంటిని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ 5 డిమాండ్ల సాధన కోసం తమ పార్టీ నిరంతర పోరాటం చేస్తుందన్నారు.